# ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

## రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

## మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టర్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.




# బ్యాంకుల్లో పైసల్లేవ్

## నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

**మారిన సగటు మదుపరి పొదుపు • ఫండ్లవైపే భారతీయుల చూపు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద కష్టమే వచ్చిపడింది. డిపాజిట్లు లేక ద్రవ్యలభ్యత కరువైపోయింది మరి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన పరిశోధనాత్మక నివేదిక.. భారతీయ బ్యాంకులు ఎదుర్కొంటున్న నగదు కొరత, పడిపోతున్న డిపాజిట్లకు అద్దం పడుతున్నది.

**రూ.0.95 లక్షల కోట్లకు పతనం**

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

**ఇదీ సంగతి..**

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల పైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌ల్లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా అవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**కఠిన చర్యలున్నా..**

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిటర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

# తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!



సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

## ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.



## ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికకావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

# 9 లక్షల కోట్లు ఆవిరి

## వరుస నష్టాల్లో మదుపరులకు పెద్ద దెబ్బ

## ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్‌లు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లె, ఎల్అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమోడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.

### బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.



బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

## లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లలో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్యాండెడ్ యాక్సెసిరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఒప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.




# విద్యుత్ అధికారులపై ఆగ్రహం

## 'నమస్తే' కథనానికి స్పందించిన ఎమ్మెల్యే



తాంసి విద్యుత్ సబ్ స్టేషన్‌లో రికార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి, అక్టోబర్ 7: విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కరెంట్ కోతలతో ఇబ్బందులు 'కాలువ నీరే రైతుల కష్టాలు తీర్చే' నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. ఎమ్మెల్యే దృష్టికి అప్రకటిత కోతలతో ఇబ్బందులు పడుతున్నామని ఫోన్ చేసిన అధికారులు స్పందించడం లేదని విద్యుత్ కోతల విషయాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాంసి విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యుత్ కోతలు పెట్టి రైతులను ఇబ్బందికి గురి చేస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల మాజీ కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్, నాయకులు మహేందర్, వినోద్ రెడ్డి, చందర్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

## వేతనాలు చెల్లించాలని

# పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 7: తమకు మూడు నెలల వేతనాలు చెల్లించాలని చేపడుతున్న నిర్మల్ పారిశుద్ధ్య కార్మికుల ధర్నా సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ధర్నా శిబిరాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సందర్శించి పారిశుద్ధ్య కార్మికుల దీక్షకు మద్దతు తెలిపారు. వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని కార్మికులు ఎమ్మెల్యేకు వివరించగా వెంటనే కమిషనర్ రూంలోకి వెళ్లి వేతనాలు ఎందుకు ఆపుతున్నారని కమిషనర్‌తో వాగ్వాదం చేశారు. మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు.



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

## సూపర్ మార్కెట్‌లో చోరీ

ఎదులాపురం, అక్టోబర్ 7 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగర్ సూపర్ మార్కెట్‌లో చోరీ జరిగినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. సోమవారం ఉదయం సూపర్ మార్కెట్ తెరువగా.. క్యాష్ కౌంటర్ తెరిచి ఉంది. సీసీ పుటేజీని పరిశీలించగా ఆదివారం అర్ధరాత్రి 12.45 గంటలకు సూపర్ మార్కెట్‌పై ఉన్న షెడ్డులో ముఖానికి మాస్క్ వేసుకుని లోనికి ప్రవేశించినట్లు రికార్డయింది. క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.2.45 లక్షలు చోరీకి గురైనట్లు నిర్ధారించారు. సూపర్ మార్కెట్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. దుండగుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



సీసీ పుటేజీలో రికార్డయిన దృశ్యాలు



బోసిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు

## ఘనంగా బతుకమ్మ సంబురాలు

*తానూర్‌తో పాటు బోసి గ్రామంలో సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తానూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మ పాటలు పాడుతూ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు, బోసి వీడీసీ చైర్మన్ ఉత్తమ్ బాలేరావ్, మాజీ సర్పంచ్ శివరాత్రే ఆనంద్, వీడీసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు. - తానూర్, సెప్టెంబర్ 7*



బతుకమ్మ ఆడుతున్న ఆర్టీసీ మహిళ ఉద్యోగులు

### ఆర్టీసీ ఆధ్వర్యంలో..

*ఆదిలాబాద్ ఆర్టీసీ ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ ఆవరణలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సంబురాలకు ఆర్టీసీ ఆర్ఎం సోలోమాన్, డిపో మేనేజర్ కల్పన హాజరయ్యారు. ముందుగా గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం భారీ బతుకమ్మను మధ్యలో ఉంచి ఆర్టీసీ మహిళల ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. అలాగే ఆర్టీసీ ఆర్ఎం సైతం బతుకమ్మ ఆడుతూ ఉత్సాహపరిచారు. - ఎదులాపురం, అక్టోబర్ 7*

# అంతర్రాష్ట్ర నకిలీ బంగారం దొంగల అరెస్టు

- ఇద్దరు అరెస్టు.. పరారీలో ముగ్గురు
- ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

ఎదులాపురం, అక్టోబర్ 7 : అంతర్రాష్ట్ర నకిలీ బంగారం దొంగల ముఠా నుంచి ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. అనంతపూర్ జిల్లా కనగల్లు మండలంలోని కూడేరు గ్రామానికి చెందిన ఇ.నాగరాజు, కర్నూల్‌కు చెందిన దేవర తిమ్మరాజు, ఇ.సుధాకర్, గోపాల్, కారు డ్రైవర్ ప్రవీణ్(బళ్లారి-కర్నాటక)కు చెందిన ఐదుగురు ముఠాగా ఏర్పడి వ్యాపారులకు నకిలీ బంగారం చూయించి అసలైందిగా నమ్మించి మోసం చేస్తుంటారని పేర్కొన్నారు. ఆదివారం ఆ ముఠా ఆదిలాబాద్‌కు వచ్చి పట్టణంలోని రాధాకృష్ణ లాడ్జిలోకి ఇ.నాగరాజు, దేవర తిమ్మరాజులు వెళ్లి అక్కడ ఉన్న రిసెప్షనిస్టును తమకు గది కావాలని చెప్పి పై నున్న గదిలోకి అతనికి తీసుకువెళ్లారు. వెంటనే రెండో బ్యాచీలోని ఇద్దరు కౌంటర్ వద్దకు చేరుకుని కౌంటర్లలో నగదు చోరీ యత్నం చేయగా అది తెరుచుకోలేదు. దీంతో అక్కడున్న విజిటర్స్ దస్త్రాలను తస్కరించి తీసుకెళ్లారు. అనంతరం మొదటి బ్యాచీ వారు తమకు గది నచ్చ లేదని వెళ్లిపోయారు. రిసెప్షనిస్ట్ కౌంటర్ వద్దకు వచ్చి చూడగా విజిటర్స్ పుస్తకాలు కనబడకపోవడంతో, కౌంటర్ వద్ద వస్తువులు చిందరవిందరగా పడి ఉన్నాయి. దీంతో లాడ్జి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ముఠా వారు లాడ్జిల్లో ఇలా సందర్శకుల పుస్తకాలు చోరీ చేసి అందులో ఉండే సెల్ ఫోన్ నంబర్లకు ఫోన్‌లు చేసి తమకు తవ్వకాల్లో బంగారం దొరికిందని చెప్పి నమ్మించి నకిలీ బంగారం అంటగడుతుంటారని డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో నాగరాజు ఇది వరకే మూడు కేజీల నకిలీ బంగారం విక్రయించి వ్యాపారి నుంచి రూ.5 లక్షలకు కాజేసిన కేసులో మంథని పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. స్పందించిన పోలీసులు సోమవారం ఈ నాగరాజు దేవర తిమ్మరాజును అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సై ఇసాక్ ఉన్నారు.

## ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 7 : ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను ఆమె స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడకగదులు ఇండ్లు వంటి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

## కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్ సర్వే

బోథ్, అక్టోబర్ 7 : మండలంలో ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం-2020) సర్వే కొనసాగుతుంది. సోమవారం ధన్నూర్(బీ), బోథ్, కుచులాపూర్, పొచ్చెర, సొనాల గ్రామాల్లో 1164 లే అవుట్లు, ఇంటి స్థలాలకు సంబంధించి సర్వే చేపట్టారు. పంచాయతీ రాజ్ శాఖ తరపున గ్రామ పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ తరపున రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటి పారుదల శాఖ తరపున ఏఈలతో కూడిన మూడు బృందాలు సర్వే చేస్తున్నాయి. 2020 సంవత్సరంలో ఇంటి స్థలం ఎల్ఆర్ఎస్ కోసం రూ.వెయ్యి, లే అవుట్ల కోసం రూ.10 వేలు చెల్లించిన వారికి సంబంధించి సర్వే చేపడుతున్నారు. ఎటువంటి అవరోధాలు లేని వాటికి సంబంధిత అధికారులు క్లియరెన్స్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. ధన్నూర్(బీ)లో సర్వేను ఎంపీడీవో జీవన్ రెడ్డి పరిశీలించారు. సర్వేలో ఆర్ఐ సునీత, పంచాయతీ కార్యదర్శి శైలజ పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో ప్రసవం

ఎదులాపురం, అక్టోబర్ 7: ఆదిలాబాద్‌లోని ఓ గర్భిణి 108 అంబులెన్స్‌లోనే ప్రసవించిన ఘటన చోటు చేసుకుంది. తాటిగూడ కాలనీకి చెందిన భాగ్యశ్రీ అనే గర్భిణికి సోమవారం పురిటి నొప్పులు తీవ్రం కావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. వెంటనే వాహన సిబ్బంది గర్భిణిని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే అంబులెన్స్‌లో ప్రసవించి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

## 9 నుంచి సదరమ్ శిబిరాలు

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 7 : ఈ నెల 9 నుంచి దివ్యాంగులకు సదరమ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న దివ్యాంగులకు చరవాణి నంబర్‌కు సమాచారం వచ్చిన వారు ఆయా తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానకు రావాలన్నారు. ఈ నెల 9న కీళ్లు, ఎముకలకు సంబంధించిన దివ్యాంగులు, 17న మానసిక దివ్యాంగులు, 24న దృష్టిలోపం ఉన్నవారు, 30న వినికిడి లోపం ఉన్న దివ్యాంగులు శిబిరాలకు రావాలన్నారు.

## 100 కిలోమీటర్ల పాదయాత్రగా కేళాపూర్‌కు..



కేళాపూర్ క్షేత్రంలో కరంజి దీక్షాపరులు

భీంపూర్, అక్టోబర్ 7 : భీంపూర్ మండల సరిహద్దు గ్రామం కరంజి(టీ)కి చెందిన 50 మంది దేవీ ఉపాసకులు దీక్షాధారులు 100 కిలో మీటర్ల పాదయాత్రగా మహారాష్ట్ర కేళాపూర్ వెళ్లారు. అక్కడ సోమవారం జగదాంబదేవి దర్శనం చేసుకున్నారు.

## గిరిజన సమస్యలు పరిష్కారానికి కృషి

ఉట్నూర్, అక్టోబర్ 7: గిరిజన సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే గిరిజనుల సమస్యలను తెలుసుకుంటూ ఆయా శాఖల అధికారులకు రెఫర్ చేశారు.